
# కనులపండువగా కార్తీక పౌర్ణమి

- శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు చేసిన ప్రజాప్రతినిధులు, భక్తులు

మంచాల, నవంబర్ 15 : మంచాల మండల పరిధిలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. స్వామివారి జాతర శుక్రవారం నుంచి మొదలైంది. భక్తులు తెల్లవారుజామున నుంచే ఆలయానికి చేరుకొని కార్తీక స్నానాలను ఆచరించిన అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో ఉన్న తులసి కోటవద్ద కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సమీపంలో ఉన్న నాగన్న పుట్ట, కబీర్‌దాస్ మందిరం, నర్సింహబాబా స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కుటుంబసమేతంగా చెట్ల కింద వంటావార్పు చేసుకొని వన భోజనాలను చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అధికారులు, పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జాతర సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఉదయం 7 గంటలకు స్వామివారి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకం నిర్వహించారు. ఆలయ ఆవరణలో రూ. 6లక్షలతో భక్తుల విశ్రాంతి కోసం చేపట్టిన షెడ్డును ఆయన ప్రారంభించారు. ముందుగా అధికారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలశంకర్, ఏపీపీ రాజు, సీఐ మధు, నాయకులు పాల్గొన్నారు. అలాగే వికారాబాద్ మున్సిపల్ పరిధి బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలను కనులపండువగా నిర్వహించారు.


వికారాబాద్ మున్సిపల్ పరిధి బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


మంచాల : శివలింగానికి అభిషేకం


మంచాల : సత్యనారాయణస్వామి వ్రతం


మంచాల : స్వామివారి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


మంచాల : బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


మంచాల : స్వయంభు శివలింగానికి పూజలు


విలేకరులతో మాట్లాడుతున్న రాజావరప్రసాద్

## ఏం సాధించారని సంబురాలు..?

**సహాయ సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్**

షాద్‌నగర్, నవంబర్ 15 : ఏ మొహం పెట్టుకొని ఏడాది పాలన సంబురాలను జరుపుకొంటున్నదని సహాయ సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం షాద్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. గత పదకొండున్నర నెలల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదని, అన్ని శాఖలు ఘోరంగా విఫలయ్యాయని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంత్రి తుమ్మల సొంత నియోజకవర్గంలో పత్తి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గంలో వడ్లను కొనేటోడు లేడని, మద్దతు ధర కంటే తక్కుగా మిల్లర్లు కొంటున్నారన్నారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో శాంతి భద్రతలు కరువయ్యాయన్నారు. విద్యాశాఖ నిర్లక్ష్యంతో గురుకుల పాఠశాలల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు దవాఖానలపాలయ్యారన్నారు. నిత్యం విద్యుత్ కోతలతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఇలా సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు అన్ని శాఖల నిర్వహణల్లో ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు.

ప్రభుత్వ పనితీరును ప్రశ్నించినా, మూసీ ప్రక్షాళన పేరు ఎత్తినా, ఫార్మా సిటీ గురించి ప్రతిపక్ష పార్టీలు మాట్లాడితే వ్యక్తిగత విమర్శలకు దిగుతూ, ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం సొంత నియోజకవర్గంలో ఫార్మా సిటీ పేరుతో పేద భూములను దోచుకునేందుకు ప్రభుత్వం కుట్ర పన్నితే, అక్కడి ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ నాయకులు నిలబడితే వారిపై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో మల్లన్న సాగర్ బాధితులకు అండగా ఇప్పటి సీఎం ఆందోళనలు చేస్తే కేసులు నమోదు చేశారా? అని ప్రశ్నించారు. ప్రజల పక్షాన మాట్లాడితే సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దాడులకు దిగడం కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. డీపీఆర్ లేకుండానే మూసీ ప్రక్షాళన పేరుతో నిర్మాణాలను కూలగొడుతుంటే ఎవ్వరు కూడా స్పందించకూడదా? ఎమ్మెల్సీ కోదండరామ్ గతంలో తెలంగాణ విద్యావంతుల వేదిక, పౌర హక్కుల వేదిక పేరుతో ప్రభుత్వ పనితీరును ప్రశ్నించారని, కానీ ఇప్పుడు ఒక్క పదవి రాగానే ఆ గొంతు మూగబోయిందా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై తిరుగబడే రోజులు వచ్చాయని, హామీలను అమలు చేయకుంటే బాజాప్తా నిలదీస్తారన్నారు. సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి ఏ అధికార హోదాలో నియోజకవర్గంలో పర్యటిస్తున్నారో చెప్పాలని.. ఆయనకు, ఆయన బృందానికి అధికారులు స్వాగతాలు పలుకడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ప్రజా పాలనలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, ప్రజలకు ఇచ్చిన హామీలపై శ్రద్ధ పెట్టి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకుడు చందూనాయక్ పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- కడ్తాల్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో గిరిజన గౌరవ దినోత్సవ సమారోహం


కార్యక్రమంలో గిరిజన విద్యార్థుల ప్రదర్శన, సంప్రదాయ నృత్యం



కడ్తాల్, నవంబర్ 15 : గిరిజనుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను గిరిజనులు, చెంచులు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో గిరిజన వీరుడు దర్తీ ఆబా భగవాన్ దిర్సాముండా 150వ జయంతి వేడుకల సందర్భంగా గిరిజన గౌరవ దినోత్సవ సమారోహాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ గిరిజన సాధికారత, మౌలిక వసతుల కల్పన, ఆర్థికాభివృద్ధి, వికసిత్ భారత్ లక్ష్యంగా చేపట్టిన దర్తీ ఆబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పథకం ఉద్దేశాన్ని దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన విద్యార్థులకు, ప్రజలకు ప్రధాని అందించే సందేశాన్ని వీక్షించేందుకు గిరిజన వసతి గృహంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు డీటీడీవో రామేశ్వరిదేవి, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేకాధికారి గీతప్రేమి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిర్సా ముండా చిత్రపటానికి ఎమ్మెల్యే, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెంచు గ్రామాలు, తండాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు ప్రజల సంక్షేమానికి ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. గిరిజనులు తమ పిల్లల బంగారు భవిష్యత్‌కు వారిని పాఠశాలలో చేర్పించాలన్నారు. గిరిజన విద్యార్థులు రిజర్వేషన్లను వినియోగించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో 40 వేల నుంచి 45 వేల మంది గిరిజనులున్నారని, వారందరూ ప్రస్తుతం ఆయా రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు.

డీటీడీవో రామేశ్వరీదేవి మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం దర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లోని చెంచుగూడాలు, తండాల్లో మౌలిక వసతులు, ఆరోగ్య, విద్య, జీవనోపాధి కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

అనంతరం ఆశ్రమ పాఠశాలలో చదువుతూ వివిధ క్రీడా పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైన రాజేందర్, సిద్ధూ, ప్రదీప్, గౌతమ్, ఉత్తమ పీడీ మంజులను ఎమ్మెల్యే సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మాధవి, ఏటీడీవో వెంకటయ్య, ట్రైకార్ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, వార్డెన్లు, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకుడు భాస్కర్‌రెడ్డి, బ్లాక్, పార్టీ మండల అధ్యక్షులు, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## అనుమతికి మించి అక్రమ నిర్మాణాలు

- ఉపేక్షించేది లేదంటున్న మున్సిపల్ అధికారులు
- గుర్తించిన నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది


ఆదిబట్ల మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆదిబట్ల, నవంబర్ 15 : అనుమతులకు మించి అక్రమంగా నిర్మాణాలు చేపడితే వాటిపై ఉక్కుపాదం మోపుతామంటున్నారు ఆదిబట్ల మున్సిపల్ అధికారులు. గత కొంత కాలంగా ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో కొంతమంది బిల్డర్లు అనుమతులకు మించి కట్టడాలను చేపట్టారు. దీంతో వారం రోజులుగా ఆదిబట్ల మున్సిపల్ అధికారులు అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను గుర్తించారు. ఇప్పటికే మున్సిపల్ పరిధిలో గుర్తించిన అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఇప్పటికే ఆదిబట్ల టీసీఎస్ ముందు ప్రాంతంలోని కాలనీలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో భవనాల నిర్మాణం జోరందుకుంది. కొంత మంది అనుమతులకు లోబడి నిర్మాణాలు చేపడితే మరికొంతమంది అనుమతులకు మించి నిర్మాణాలు చేపడుతున్నారు.

### అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టొద్దు



మున్సిపాలిటీ పరిధిలో అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టొద్దు. ప్రభుత్వం ఇచ్చిన అనుమతుల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలి. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలో 10 అక్రమ నిర్మాణాలు గుర్తించి కూల్చివేశాం. మరి కొన్ని గుర్తించాం. త్వరలోనే వాటిని కూడా కూల్చివేస్తాం. ఇప్పటికైనా తమకు అనుమతులు ఉన్నంత వరకే నిర్మాణాలు చేపట్టాలి.

**- ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ**


విద్యార్థులు తయారుచేసిన ఓ వాహనాన్ని పరిశీలిస్తున్న మిరాజ్ ఫహీం

## విద్యార్థులు సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవాలి

**ది హ్యాకింగ్ స్కూల్ వ్యవస్థాపకుడు మిరాజ్ ఫహీం**

మొయినాబాద్, నవంబర్ 15: ఇంజినీరింగ్ విద్యార్థులు సృజనాత్మక శక్తిని పెంపొందించుకుంటే కొత్త ఆవిష్కరణకు రూపకల్పన చేయడానికి అవకాశం ఉంటుందని ది హ్యాకింగ్ స్కూల్ వ్యవస్థాపకుడు మిరాజ్ ఫహీం అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న సహయోగ్ 2.0–సోషల్, ఎంటర్‌ప్రైనర్‌షిప్ సమ్మిట్–2024ను శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మిరాజ్ ఫహీం మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యను పూర్తి చేసిన తరువాత ఏదో ఒక ఉద్యోగంలో స్థిరపడటం కాదని, ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలని సూచించారు. పల్లె సృజన ప్రెసిడెంట్ బ్రిగేడియర్ గణేశం మాట్లాడుతూ.. విద్యా సంస్థలు గ్రామీణ ప్రాంతంలోని ప్రజలతో మమేకమై వారికున్న సమస్యలను తెలుసుకుని గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు వినూత్న పద్ధతిలో విద్యను అందిస్తే సమాజానికి విద్యార్థులు ఉపయోగపడుతారని, ఆత్మ విశ్వాసాన్ని పెంచినవాళ్లవుతామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సత్యనారాయణరెడ్డి, కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ రోహిత్, కేస్ సీఈవో సత్య, ఇన్నోవేషన హెడ్ సురేశ్ పాల్గొన్నారు.

# ఆపరేషన్ రోప్‌కు సహకరించండి

- నగర సీపీ సీవీ ఆనంద్ ట్వీట్
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారితోనే ఆక్రమణలు




సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఆపరేషన్ రోప్‌ను పక్కాగా నిర్వహించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ట్రాఫిక్ పోలీసులకు తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన చిరు వ్యాపారులు వివిధ వస్తువులను అమ్ముకొని జీవించేందుకు సైకిల్ ట్రాక్‌లు, పుట్‌పాత్‌లను ఆక్రమించుకుంటున్నారని, ఇలాంటి సందర్భాల్లో పేదరికం, జీవనోపాధి తదితర అంశాలను తీసుకురావొద్దని సీపీ సూచించారు. పుట్‌పాత్‌లను ఆక్రమించడం వంటివి ఒక మాఫియా లాంటి చర్య అన్నారు. పుట్‌పాత్‌లను ఆక్రమిస్తే ట్రాఫిక్‌కు మరింత ఇబ్బంది కలుగుతుందన్నారు. ప్రతిరోజూ క్రేన్ల సాయంతో ట్రాఫిక్ క్లియరెన్స్ చేయాల్సిన అవసరముందన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని, ఈ పని చేస్తున్నప్పుడు అధికారులు విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటారని సీవీ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆక్రమణల తొలగింపు, రోప్ అమలులో ట్రాఫిక్ సిబ్బందికి ప్రతిఒక్కరూ సహకరించాలని సీపీ కోరారు.

### ఆపరేషన్ రోప్..

హైదరాబాద్‌లో ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు చేపట్టిన ఆపరేషన్ రోప్(రిమూవబుల్ అబ్‌స్ట్రాక్టివ్ పార్కింగ్ ఎన్‌క్రోచ్‌మెంట్స్)ను పటిష్టంగా అమలు చేస్తే రోడ్లపై వాహనాలు సాఫీగా వెళ్లే అవకాశముంటుంది. పోలీస్‌స్టేషన్ల వారీగా రోప్ అమలు చేసేందుకు ఎస్‌హెచ్‌ఓల యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుంటున్నారు. ఇంకా యాక్షన్ ప్లాన్ చేసుకోనివారు ఉంటే వెంటనే తయారు చేసుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. ఆయా ఠాణాల పరిధిలో ఎక్కడ ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది..? పుట్‌పాత్‌ల ఆక్రమణలకు కారణాలను విశ్లేషిస్తున్నారు. ఆయా ట్రాఫిక్ ఠాణాల పరిధిలో ఉన్న సమస్యలను జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ తదితర విభాగాల అధికారులతోనూ అధికారులు సమన్వయం చేసుకోవాల్సిన అవసరముంటుంది. నగరంలో ట్రాఫిక్ వ్యవస్థ రోజురోజుకూ గాడి తప్పుతున్నది. ఆపరేషన్ రోప్‌తో సాఫీగా ట్రాఫిక్ సాగే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని నగరవాసులు కోరుతున్నారు.

## ఫ్యాప్సీలో హైపెక్స్-24 ప్రదర్శన షురూ..



ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఫ్యాప్సీ అధ్యక్షుడు సురేశ్ కుమార్ సింఘాల్

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 15 : ది హైదరాబాద్ ఫిలాటెలిక్ అండ్ హాబీస్ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్ హిల్స్‌లో గల ఫ్యాప్సీ ఆడిటోరియంలో పురాతన అంశాలు, చరిత్ర, పూర్వీకుల జీవన శైలి తదితర అంశాలపై హైపెక్స్–2024 పేరుతో తపాలా స్టాంపులు, నాణేలు, కాగితపు కరెన్సీలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను ఫ్యాప్సీ అధ్యక్షుడు సురేశ్ కుమార్ సింఘాల్ ప్రారంభించారు. నేటి తరానికి చరిత్ర పట్ల అవగాహనను కలిగించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి సాగి శ్రీనివాసరాజు మాట్లాడుతూ, 1962లో ప్రారంభమైన సొసైటీ రాజులు, నిజాంలు, కాకతీయుల పరిపాలన సమయంలో ప్రజలలో చెలామణిలో ఉన్న నాటి నాణేలు, స్టాంపులు తదితర వస్తువులను సేకరించి వాటి ప్రశస్తిని నేటి తరం పిల్లలకు తెలియజేయడమే తమ లక్ష్యమన్నారు. ప్రదర్శనను మూడు రోజుల పాటు కొనసాగించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15 : ఓయూ పరిధిలోని వివిధ అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజును ఈ నెల 21లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 26వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. బ్యాక్‌లాగ్ అభ్యర్థులకు ఇది చివరి అవకాశమని పేర్కొన్నారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## బీబీఏ, బీఏ పరీక్ష తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15 : ఓయూ పరిధిలోని బీబీఏ, బీఏ పరీక్ష తేదీలను మార్చినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీబీఏ రిటెయిల్ ఆపరేషన్స్, బీబీఏ లాజిస్టిక్స్ మూడో సెమిస్టర్ రెగ్యులర్, బీఏ అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 19 నుంచి నిర్వహించనున్నట్టు గతంలో ప్రకటించామని, పరీక్షలను అదే రోజు నుంచి నిర్వహిస్తున్నప్పటికీ, వివిధ పరీక్ష తేదీలను మార్చినట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు


ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15 : ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్‌ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్ పరీక్షలను ఈ నెల 19 నుంచి నిర్వహించనున్నట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

## వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఓయూ, నవంబర్ 15 : ఓయూ పరిధిలోని పలు కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ.రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) (సీబీసీఎస్) మెయిన్, బ్యాక్‌లాగ్, సప్లమెంటరీ, బీఈ (నాన్ సీబీసీఎస్) వన్‌టైం చాన్స్ పరీక్ష ఫలితాలతో పాటు డీపీఈడీ, బీపీఈడీ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షల రివాల్యుయేషన్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చన్నారు.

## వేటు పడిన చోటే.. తిరిగి బాధ్యతల అప్పగింత..!

పెద్దేముల్, నవంబర్ 15 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా డీడీవోగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బుచ్చిబాబు వ్యవహారం అటు జిల్లా.. ఇటు మండలవ్యాప్తంగా అత్యంత చర్చనీయాంశంగా మారింది. గతంలో పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా, డీడీవో, డీఐవోగా పనిచేసిన బుచ్చిబాబు రెండు నెలల క్రితం అవినీతి ఆరోపణలతో, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గతంలో డీఎంఅండ్‌హెచ్‌వో పనిచేసిన డాక్టర్ పాల్వన్ కుమార్ ఆయనపై వేటు వేశారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్ ఉన్నన్ని రోజులు జిల్లాలో డిస్ట్రిక్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్‌గా బుచ్చిబాబు విధులు నిర్వర్తించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా వైద్య శాఖలో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయా జిల్లాల డీఎంఅండ్‌హెచ్‌వోలను ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది. డాక్టర్ పాల్వన్‌కుమార్‌ను సిద్దిపేట జిల్లాకు బదిలీ చేయగా ఆయన స్థానంలో నూతన డీఎంఅండ్‌హెచ్‌వోగా డాక్టర్ వెంకట్ రమణ బదిలీపై వచ్చారు. ఆయన విధుల్లో చేరిన అతి తక్కువ కాలంలోనే డాక్టర్ బుచ్చిబాబు పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మళ్లీ రెండోసారి డీడీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. అవినీతి ఆరోపణలెదుర్కొన్న బుచ్చిబాబుకు మళ్లే ఆయన కోరిన స్థానానికే బదిలీ చేయడంపై జిల్లాలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం బుచ్చిబాబు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. ఒక డీఎంహెచ్‌వో వేటు వేస్తే.. మరో డీఎంహెచ్‌వో బాధ్యతలు అప్పగించడంలో మతలబు ఏమిటో అని జనం చర్చించుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే..


బాల సాహితీవేత్తలకు బహుమతులను అందజేసిన వక్తలు

## ఉత్తమ సమాజ నిర్మాణానికి సాహితీ సదస్సులు దోహదం

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 15 : తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆబిడ్స్ బొగ్గులకుంట తిలక్ రోడ్డులో గల సారస్వత పరిషత్తు ప్రాంగణంలో గల ఆడిటోరియంలో శుక్రవారం కోడూరి శాంతమ్మ స్మారక బాలల సాంస్కృతికోత్సవం ఘనంగా జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు వందకు పైగా పాఠశాలల నుంచి 1200 మంది విద్యార్థులు కథ, వచన కవిత, పద్య కవిత, చిత్రలేఖనం అంశాలలో పోటీలు పడి రచనలు పంపించగా, 75మందికి పైగా రూ.500ల నగదు బహుమతులను, 85కు పైగా ప్రత్యేక ప్రశంస, జ్ఞాపిక, ధ్రువీకరణ పత్రాలను అందుకున్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు సాహిత్య, సాంస్కృతికోత్సవం సందర్భంగా వేదికపై పాటల పోటీలు, వక్తృత్వం, పుస్తక సమీక్షా రచన, ఏకపాత్రాభినయం, వ్యాసరచన తదితర అంశాలలో ప్రతిభా పాటవాలను చాటుకుని ఆహూతుల ప్రశంసలు, బహుమతులను అందుకున్నారు. అనంతరం పరిషత్తు అధ్యడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో శాంతా–వసంత ట్రస్టు వ్యవస్థాపకుడు కేఐ వరప్రసాదరెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి పాల్గొని ఉత్తమ సమాజ నిర్మాణానికి సృజనాత్మక పెరగడానికి పోటీలు దోహదపడతాయన్నారు. సంగీతం కళ గురించి కలగా కృష్ణమోహన్, నాట్య కళ విశిష్టతపై డాక్టర్ విజయ్ కుమార్జీ ప్రసంగించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్‌తో పాటు పలువురు బాల సాహితీ వేత్తలు పాల్గొని విశ్లేషణాత్మక ప్రసంగాలు చేసి విద్యార్థులను ఆలోచింపజేశారు.